# వద్దు బాబోయ్!

- టి.పి.హేమమాలిని

**అప్పటివరకూ పరిశీలించిన ఫైల్స్ మూసేసి తృప్తిగా నవ్వుకున్నాడు వంశీ. చిన్న వ్యాపారంగా మొదలుపెట్టి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగాడు. వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది.**

అతను ఊహించిన దానికన్నా రెట్టింపు లాభాలొచ్చాయి. తిరిగి ఆ డబ్బుని దేనిలో ఇన్వెస్ట్ చేయాలన్న ఆలోచనలో పడ్డాడు.

వంశీది మంచి అభిరుచి. 'కూసింత కలాపోసన' లేకపోయినా కాస్తంత కళాభిమానం ఉంది.


అతనికి సినిమాలు చూసే తీరికెప్పుడో లేకుండా పోయింది. కానీ ఖాళీ దొరికినప్పుడల్లా ఏసుదాస్, బాలమురళి గానంతో వీనులకు విందు అందిస్తాడు. ఎప్పుడైనా పాత సినిమాల సి.డి.లు చూస్తాడు.

వ్యాపారపు రేసులో ఒక్క క్షణం ఆగితే ప్రత్యర్థి గుర్రాలు దూసుకుపోతాయన్న భయంవలన వాటన్నింటినీ పట్టించుకునే సమయం చిక్కడంలేదు.

సరే! ప్రస్తుతం వ్యాపార లాభాన్ని పెట్టుబడిగా పెట్టి ఒక మంచి సినిమా తీయాలన్న సంకల్పం అతని మదిలో మెదిలింది.

తనకు, సన్నిహితులైన మిత్రుల్ని సంప్రదించాడు. ఆహా ఓహో అంటూ ఆకాశానికెత్తేసారు.

ప్రస్తుతం మార్కెట్ ఉన్న డైరెక్టర్‌ని కలవమని సలహా ఇచ్చారు. ముందుగానే సంపాదించిన అపాయింట్‌మెంట్ ద్వారా ఓ శుభ ముహూర్తాన డైరెక్టర్ దగ్గరకెళ్ళాడు వంశీ.



"రండి! కూచోండి! మీ గురించి విన్నాను. ఇంతకీ ఏం పనిమీద వచ్చారు?" తెలియనట్లే అడిగాడు డైరెక్టర్ భోజ.

"భోజగారూ! సూటిగా విషయంలోకి వస్తాను. నేను ఒక సినిమా తీయాలని అనుకుంటున్నాను. దానికి మిమ్మల్ని డైరెక్టర్‌గా బుక్ చేయాలని వచ్చాను. మీ అభిప్రాయం చెప్పండి?" సూటిగా అడిగాడు వంశీ.

ఏక్చువల్లీ నేనిప్పుడు "నువ్వేనేను- నేనే నువ్వు" సినిమా షూటింగ్‌కి బయల్దేరాలి. మీ ఫోన్‌తో ఆగిపోయాను. దర్పంగా చెప్పాడు భోజ.

"తానొకటి అడిగితే అతను వేరే విషయం చెప్తాడేమిటి?" తనలోనే అనుకున్నాడు వంశీ. కొద్దిసేపు నిశ్శబ్దం.

"నేనడిగిన దానికి మీరు జవాబు చెప్పనే లేదు" తిరిగి అడిగాడు వంశీ. కొంతసేపు ఆలోచిస్తున్నట్లుగా ముఖం పెట్టి "నిజానికి రెండేళ్ళవరకు నా డైరీ ఖాళీ లేదు. కానీ మీరు స్పెషల్‌గా రిక్వెస్ట్ చేస్తున్నారు కాబట్టి ఆదివారాలతో కలిపి అరవై రోజులు కాల్షీట్స్ ఇస్తాను" చెప్పాడు భోజ.

"ఇంతకీ రైటర్‌గా ఎవర్ని బుక్ చేద్దాం?" వంశీ ప్రశ్న వినగానే భోజ పగలబడి నవ్వాడు. అతనెందుకు నవ్వుతున్నాడో అర్థంకాలేదు వంశీకి. "రైటర్ ఎవరైనా? ఎందుకూ? నేనే కథ, స్క్రీన్‌ప్లే సమకూరుస్తాను. ఆల్ ఇన్ వన్" అతిశయం ఉట్టిపడింది భోజలో.

"సరే! మీకు మంచి కథ స్ఫురించగానే నాకు కబురు చేయండి. స్టోరీ డిస్కషన్‌కి కూచుందాం. వస్తాను" అంటూ లేచాడు వంశీ.

వన్ ఫైన్ మార్నింగ్. కథ సిద్ధమంటూ భోజనుంచి కబురొచ్చింది. వంశీ! భోజ ఇద్దరూ కూచున్నారు.

"మంచి ఫాలోయింగ్ ఉన్న ఇతి వృత్తం ఇది" అంటూ చెప్పడం ప్రారంభించాడు భోజ.

"పక్క పక్క ఇళ్లల్లో రెండు కుటుంబాలుంటాయి. అన్ని విషయాల్లోనూ కలిసి మెలిసి ఉంటూ ఒకరికొకరు సాయపడుతూ ఉంటారు. "భోజ చెప్తుండగానే 'శుభారంభం' అనుకున్నాడు వంశీ.

"వారిలో ఒకరికి అబ్బాయి, ఒకరికి అమ్మాయి పుడతారు. వారిద్దరికీ చిన్నప్పటినుండీ తగవులే. ఒక్క విషయంలోనూ పడదు. అవి వారి చిలిపి కయ్యానికి మురిపెంగా నవ్వుకుంటారు పెద్దలు.

అమ్మాయి అందంగా ఉంటుంది. అందుకే గీర అని అబ్బాయి అభిప్రాయం. అబ్బాయికి బోలెడు డబ్బుంది, అందుకే పొగరు అని అమ్మాయి భావం. చెప్పుకుపోతున్న భోజకి అడ్డు తగిలాడు వంశీ. "అదేమిటండీ! పెద్దలు అంత సఖ్యతగా ఉంటే ఆ వాతావరణంలో పెరిగిన పిల్లలు దెబ్బలాడుకోవడమేమిటి అసహ్యంగా. అంతేకాదు చిన్న పిల్లలకు అందం విలువ, డబ్బు విలువ ఏం తెలుస్తాయండీ?"

"అదేనండీ ఈ రోజు ట్రెండ్! సరే! పిల్లలు విభేదాలమధ్యే అబ్బాయి కుటుంబానికి వేరే ఊరు ట్రాన్స్‌ఫరవుతుంది. పెద్దలు ఎడబాటుకు బాధపడుతుంటే, వీళ్ళిద్దరూ ఆనందిస్తారు. వారు వెళ్ళిపోతూ రిలేషన్స్ కొనసాగించాలనీ, ఎప్పటికైనా వియ్యంకులు కావాలనీ ఆశపడుతారు.

తర్వాత యుక్తవయసులోకి అడుగుపెట్టిన హీరోయిన్ పరిచయం. టెన్త్ పూర్తిచేసిన హీరోయిన్ కాలేజీలోకి అడుగుపెడుతుంది.

ఆమె కాలేజ్‌లోకి అడుగుపెట్టగానే పెద్దగాలి వచ్చి ఆమె వేసుకున్న పైట ఎగిరిపోతుంది. గుండెలకడ్డంగా పుస్తకాలు పెట్టుకుని నిలబడిన ఆమెను అల్లరిమూక చేరి ఏడిపిస్తుంటారు.

"ఇంతలో ఒకతను చెట్టుకొమ్మలమీంచి గెంతుతూ, ఊడల సాయంతో పెద్దచెట్టుమీదున్న ఆమె ఓణీ తెచ్చిస్తాడు."

"పోన్లెండి! హీరో ది మెచ్యూర్డ్ కేరక్టర్‌లా ఉంది. నిండైన విగ్రహం, చక్కటి మీసకట్టు, స్ఫురద్రూపం..." తన్మయంగా పలికాడు వంశీ.

"ఆс...ఆс... కాదండీ! హీరో కూడా కాలేజ్‌లో జాయినవడానికే వస్తాడు. మన హీరో సన్నగా ఉంటాడు. ఇంకా మీసాలు కూడా రావు. పెద్ద అందగాడు కాదు. అదే నేటి ట్రెండ్". హుషారుగా చెప్పాడు భోజ.

"ఓహో! చిన్నప్పుడు పరస్పరం అసహ్యించుకున్న పిల్లలు ఇప్పుడు పెద్దయ్యాక, ఫలానా అని తెలీకుండా ఫ్రెండ్సవుతారు కదా!" తెలిసిందన్నట్లు అన్నాడు వంశీ.

"అబ్బెబ్బే! హీరో లేరండీ! ఆ చిన్నప్పటి అబ్బాయి కేరక్టర్ తర్వాత వస్తుంది. హీరో పేద కుర్రాడు. అడవుల్లో చెట్లమీదుండే రకరకాల పిట్టల్ని పట్టి పెంచుకు నేవారికి అమ్ముతుంటాడు. ఇతను పట్టే పిట్టలకోసం ప్రత్యేకంగా సిటీనుంచి వచ్చి మరీ కొనుక్కుంటారు." అలా వచ్చే డబ్బుతో చదువుకుంటుంటాడు. వివరించాడు భోజ.

"మరి హీరో తల్లిదండ్రులు?"

వాళ్ళిద్దరూ చిన్నప్పుడే పోతారు. అతను ఒక్కడే పెరుగుతాడు. ఇంక కాలేజీ వాతావరణం! కాలేజ్‌లో లెక్చరర్లని ఏడిపించడం, ప్రిన్సిపాల్‌కి, లేడీ లెక్చరర్‌కి కనెక్షనుందని కామెంట్ చేయడం, క్లాసులకు ఎటెండ్ కాకపోవడం... ఇవన్నీ ఉంటాయి.

"అయ్యో తప్పుకదండీ! గురువు దేవుడుతో సమానం అన్నారు. విద్య గరిపే గురువులను కామెంట్ చేయచ్చా? ఆ పాత్రలు ఉన్నతంగా ఉండాలి" చెప్పబోయాడు వంశీ.

"పాత్రలు, తపేలాలు మనకెందుకండీ? మనకు కావలసింది..." చెప్తున్న భోజకు అడ్డు తగిలాడు వంశీ...

"'ఫాలోయింగ్ ప్రజెంట్ ట్రెండ్ అదేకదా! అతని మాటల్లో వెటకారం పట్టించుకోలేదు భోజ. తన ధోరణిలో ముందుకెళ్లాడు.

"హీరో హీరోయిన్స్ మధ్య చిలిపి తగవులు, గిల్లికజ్జాల లోంచే ప్రేమ పుడుతుంది.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరి పడ్డాడు వంశీ.

"టెన్త్ క్లాసు పూర్తయిన పిల్లలకు ప్రేమా?"

"ఈ ప్రేమ పుట్టాక రెండు పాటలు. తర్వాత విలన్ ఎంట్రన్స్.. విలన్ ఎవరో కాదు. చిన్నప్పుడు హీరోయిన్ మీద ద్వేషం పెంచుకున్న పక్కింటబ్బాయ్. అతడు 'సకల' గుణాభిరాముడు. తల్లిదండ్రులు ఎంత పోరినా హీరోయిన్‌ని పెళ్ళిచేసుకోనంటాడు.


ఏదో సందర్భంలో హీరోయిన్‌ని చూసిన విలన్ అభిప్రాయం మారిపోతుంది. అందంగా ఉంటుంది కనుక అహం ఎక్కువ అని అభిప్రాయంతో ఉన్నవాడు కాస్తా, అంత అందగత్తె తన స్వంతం కావాలనుకుంటాడు.

హీరోయిన్ తను హీరోని ప్రేమించానంటుంది. అయినా తనకేం ఫరవాలేదంటాడు. పెద్దలు పెళ్లి నిశ్చయించేస్తారు. ముందుగా వేసుకున్న ప్లాను ప్రకారం పెళ్లికూతురిని పీటల మీద నుండి ఎత్తుకుపోతాడు. చెట్లెక్కి దిగిన అనుభవంతో నడుముకు తాడుకట్టుకుని."

"అంత చిన్న పిల్లాడా?"

"అతని వయసెంత అని కాదు ముఖ్యం. హీరో ఏం చేసినా అలాగే ఉండాలి."

హీరో నడుముకి తాడుకట్టుకుని చెట్ల ఊడలను పట్టుకుని వేలాడి, వేలాడి చివరకు రైల్వే ట్రాక్ పక్కన పడతారు. అదే సమయానికి అటుగా వస్తున్న గూడ్స్ ట్రైనెక్కిస్తారు పరుగెట్టి. వీరిద్దరినీ చూసిన గార్డ్ సహాయం చేస్తాడు. పారిపోయిన హీరోయిన్‌కోసం



హీరోయిన్ తను హీరోని ప్రేమించానంటుంది. అయినా తనకేం ఫరవాలేదంటాడు. పెద్దలు పెళ్లి నిశ్చయించేస్తారు. ముందుగా వేసుకున్న ప్లాను ప్రకారం పెళ్లికూతురిని పీటల మీద నుండి ఎత్తుకుపోతాడు. చెట్లెక్కి దిగిన అనుభవంతో నడుముకు తాడుకట్టుకుని."

విలన్ మందిమార్బలంతో వెంటపడతాడు.

ట్రైనెక్కేసిన హీరోకి గురిచూసి రెండు కత్తులు విసురుతాడు. ఒకటి వెన్నులోనూ. ఒకటి కాలులోనూ గుచ్చుకుని, హీరో ట్రైన్ మీద నుండి పడిపోతాడు. తర్వాత కిటికీ ఆసరాతో రక్తం ఓడుతున్నా సరే మీదకి ఎక్కిపోతాడు."

"అబ్బా! అంత రక్తపాతం అవసరమా?"

"లేకపోతే హీరో మీద సింపతీ కలగదు. ఇలా వెళ్తున్న ట్రైన్ మధ్యలో ఆగగానే వాళ్లిద్దరూ దిగి అడవిలోకి పారిపోతారు."

"అంత చిన్న పిల్లలు అడవిలో... భయం వేయదా?" అడిగాడు వంశీ.

"అందుకే ముందే చూపిస్తాం, హీరోకి అడవి వాతావరణం తెలుసున్నట్టు."

అలా వెళ్ళిన ఇద్దరూ ప్రకృతి అందాలతో ఆడుకుంటారు. హీరోయిన్ ఆకలేస్తోందనగానే రెండు పిట్టల్ని పట్టి తెస్తాడు హీరో. మంట పెట్టి కాల్చబోతుండగా హీరోయిన్ వద్దని వాటిని లాలిస్తుంది."

"అక్కడ మంట ఎలా పెట్టగలిగాడు?"

"అలాంటివన్నీ అడగక్కరలేదు. రెండురాళ్ళతో మంట పుట్టించారని అర్థం అయిపోతుంది ప్రేక్షకులకు."ప్రేక్షకుల తెలివితేటలమీద అపారమైన నమ్మకం ప్రదర్శించాడు భోజ.

"పళ్లు, కాయలు తిని అడవిలో తిరుగుతుండగా ఒకచోట లవ్ సింబల్ ఉన్న జెండా కనిపిస్తుంది."

"అంత కీకారణ్యంలో జెండానా? ఎలా?"

"మీరసలు ఇప్పటి సినిమాలు చూస్తున్నట్లు లేదు. అంతకు ముందు వీళ్లలాగే వచ్చిన ప్రేమ జంట పాతి ఉండచ్చు." అప్పుడు ప్రేమ గొప్పతనాన్ని వివరిస్తూ ఓ పాట.

అయిందా! అడవిలో ఒక చిన్న పాక వేసుకుని, ఒక గేదెని మేపుతూ, దాని పాలు పక్క టౌన్‌లో అమ్ముకుని వస్తుంటాడు. హీరో. అలా వచ్చిన డబ్బుతో హీరోయిన్‌కి బట్టలు, పౌడర్లు, క్రీములు తెస్తాడు."

"అడవిలో వీళ్లకి గేదెలు, ఆవులు ఎలా దొరికాయండీ?"

"మరి వాళ్లు బతకడానికి ఉపాధి కావాలిగా! అందుకే అలా చూపిస్తాం. ప్రేక్షకులకు రీజనింగ్ ఉండదు. ఎంజాయ్ చేస్తారు. హీరోయిన్ పండించిన కాయగూరలు వండుకుంటూ తింటూ ఉంటారు.

ఒకానొక సమయంలో ఒకటైన ఫలితంగా హీరోయిన్ నెల తప్పి పిల్లాడ్ని కంటుంది. "కథలో మలుపులు వివరిస్తున్నాడు భోజ."

"బాబోయ్! అసలేం చెప్తున్నారు మీరు?"

"ఇప్పుడు క్లైమాక్స్. వీళ్ళెక్కడున్నారో తెలుసుకున్న విలన్ అడవికొస్తాడు. ఎదురుపడతారు.

విలన్ వస్తాదులా ఉన్నా, హీరో కొట్టగలుస్తాడు. ప్రేమ బలంతో, హీరోయిన్ ప్రోద్బలంతో.

మొదటకాదన్న పెద్దలు వీళ్ళకు పెళ్ళిచేయాలని నిర్ణయించుకుని అదే అడవికొస్తారు."

"వాళ్ళకెలా తెలిసింది?"

"ముందే చెప్పానా? అవన్నీ అర్థంలేని ప్రశ్నలు." విసుక్కున్నాడు భోజ.

'పెద్దవాళ్ళు రక్తాలోడుతున్న హీరోకీ, పిల్లడ్నెత్తుకున్న హీరోయిన్‌కీ దండలిస్తారు మార్చుకోవడానికి. విలన్ గట్టిగా అరిచి వెళ్ళిపోతాడు. కథ సుఖాంతం. ఎలా ఉంది?" గర్వంగా అడిగాడు భోజ.

అయిదారేళ్ళ పిల్లలు... అందం, డబ్బు, పొగరు, ద్వేషం... పదిహేనేళ్ళ పిల్లలు... కాలేజ్, లెక్చరర్లని వెటకారం, ప్రేమ, పెద్దలు, పరారీ, కడుపు, రక్తపాతం, పెళ్లి... కథ విన్న వంశీకి బుర్రంతా గజిబిజిగా తయారయింది.

తనేదో మంచి అభిరుచితో సిన్మా తీయాలనుకుంటే ఇదా కథ? తల్లిదండ్రుల రెక్కల కింద గువ్వల్లా ఒదగాల్సిన పిల్లలతోనా ఇంత కథ నడిపించడం?

ఒక నిర్ణయానికి వచ్చినట్లు లేచాడు వంశీ.

"ఎక్కడికి?" ప్రశ్నించాడు భోజ.

"మీ కథ నాకు నచ్చలేదు. అందుకే కంచికి బయలుదేరాను. చిన్నప్పుడు మా అమ్మ చెప్పిన కథలన్నీ కంచికే చేరుతాయంది. అందుకే నాకు కావలసిన మంచి కథకోసం అక్కడ వెతుకుతాను.. వస్తాను" అంటూ లేచాడు. బిత్తరపోవడం భోజ వంతయింది.

తను సినిమాల్లో పెట్టుబడిగా పెట్టాలనుకున్న సొమ్ముతో వృద్ధ కళాకారులకు ఒక ట్రస్ట్‌ను ఏర్పరచాడు వంశీ.

★